

# దారి ఏది?

– దాసరి శిరీష

పెళ్ళి కొడుకు స్ఫురద్రూపి సాత్వికంగానే ఉన్నాడు. పనికి మాలిన ప్రశ్నలతో లలితని వేధించడం లేదు.

అసలే పెళ్ళి చూపుల తంతుపట్ల ఎంతో వ్యతిరేకత పెంచుకున్న లలిత అందరమ్మాయిల్లాగానే తండ్రి ధర్మాలని గుర్తించి, తలవంచే యువతుల్లాగానే కించ పడుతూ అప్పుడప్పుడూ పెళ్ళి చూపుల్లో బుద్ధిగా కూచుంటోంది. వింత అనుభవాలను ఎదుర్కొంటోంది.

అతను సంస్కారవంతంగానే ప్రశ్నిస్తున్నాడు. ఆమె నిర్లిప్తంగా జవాబిస్తోంది.

"మీరేదో జాబ్ చేస్తున్నారనుకుంటా?"

అవునన్నట్టు తలాడించి ఆ ఫాక్టరీ పేరు చెప్పింది.

కాస్సేపు లలితతో క్రిష్ణారావ్‌తో మాటాడాక అతను నిర్మొహమాటంగా తన అభిప్రాయం చెప్పాడు. 'ఆడవాళ్ళ చదువు పట్ల గాని, ఉద్యోగాలపట్ల గాని అభ్యంతరం ఉన్న వాడ్నిగాను. మా అక్కయ్య కూడా టీచరే. కాని మా ఇంట్లో మా అమ్మగారి ఆరోగ్యం బావుండదు. తమ్ముడూ చెల్లీ కాలేజీకి వెళ్ళిపోతారు. రోజుకు ఇరవయి కిలో మీటర్లు దూరం వెళ్ళాలి నేను ఆఫీసుకి. ఈ లోపల అమ్మెలా ఉందో అని టెన్షన్ మా అందరికీ అరమరికల్లేకుండా ప్రేమించి ఆదరంగా చూస్తూ, ఇంట్లో అన్నీ నిర్వహించుకోగలిగిన భాగస్వామి కావాలి. కట్న కానుకలవసరం లేదు. నాక్కావాల్సింది సభ్యతా సంస్కారం గల స్త్రీ. మాతో కలసిపోగలిగిన స్త్రీ!

"ఈ రోజుల్లో భార్యాభర్త లిద్దరూ సంపాదిస్తేగాని ఈ సిటీలో కుదరదు" కూతురి చూపులు అర్థం చేసుకుంటున్న క్రిష్ణారావ్ అన్నాడు.

"నిజమే. కాని ఆ సంపాదన వల్ల ఎన్నో కుటుంబాల్లో సుఖశాంతులు కరువవుతున్నాయి. పిల్లలకి సరయిన ప్రేమ దొరకదు. కేవలం నా కుటుంబం వల్ల నాకున్న స్వార్థం వల్ల, నా స్వంత జీవితం నిర్మలంగా సాఫీగా జరిగిపోవాలనే ఆశవల్ల లలితగారు ఉద్యోగం మానాలని రిక్వెస్ట్ చేస్తున్నాను" చిరునవ్వు నవ్వాడు.

అతను చాలా నచ్చాడు లలిత తల్లికి. మొదట్నుంచీ లలిత భావాలని స్వేచ్ఛగా ఎదగనిచ్చిన క్రిష్ణారావ్ ఒక పక్క పెళ్ళికొడుకు చంద్రాన్ని మెచ్చుకుంటునే తనకి తెలిసిన తనకూతురి ఆశయాలన్నీ గృహిణిగా స్థిరపడానికే ఇవ్వుడు పని కొచ్చేసరికి ఆమె నైరాశ్యాన్ని ఊహించలేక కళవళ పడ్డారు. కాని కట్నం అఖ్ఖర్లేదంటూ ఇంతవరకు ఎవరూ రాలేదు. ఇది ఒక రకంగా లలితకి వ్యక్తిగతంగా విజయమే. ఆ రాత్రి నిద్ర పట్టలేదు లలితకి. తను కేవలం లలితగానే ఎదిగి స్థిరపడడానికి అనువైన పరిస్థితులు ఇంటా బయటా లేవు. అవసరమయితే తన ఆశయ సిద్ధికోసం పెళ్ళి మానేసేటంత కఠోరమైన నిగ్రహం, నిర్ణయం తనకేమీ లేవు. కాని వైవాహిక జీవితంలో తన స్థానమేమిటో నిర్ణయమయిపోయింది. ఒక రకంగా తన భవిష్యత్ మొత్తం చేసుకోబోయే వ్యక్తి నిర్ణయాల మీదే ఆధారపడి ఉండడం ఎంత దయనీయం'.

తెల్లవార్లూ ఆలోచించి మధనపడి తన నిర్ణయం తెలియ జేసింది. చంద్రం మానసిక పరిధిని తను అంచనా వేయలేకపోతోంది గాని అతనేమిటో అనేది స్పష్టంగా నిజాయితీగా చెప్పాడు. భ్రమలో పెట్టలేదు.

పెళ్ళి నిర్విఘ్నంగా జరిగిపోయింది. మగ పెళ్ళివారిగా వాళ్ళు ఎటువంటి ఇబ్బందులూ పెట్టలేదు. వీళ్ళేమిస్తే అది సంతోషంగా పుచ్చుకుని సౌమ్యంగా ప్రవర్తించారు. బంధువులూ స్నేహితులూ లలిత అదృష్టాన్ని పదేపదే

పొగుడుతుంటే లలిత తనలో తలెత్తుతున్న అసంతృప్తిని సంతృప్తితో అణచి వేసింది. కొన్నాళ్ళ తర్వాత అతన్ని కన్విన్స్ చేసి తను ఉద్యోగంలో చేరవచ్చు అనుకుంటూ ఆనందంగా అత్తవారింట అడుగుపెట్టింది.

రెండ్నెల్లు గడిచాయి. అతను చెప్పినట్టుగానే లలిత ఉపయోగం ఉదయం ఆరింటినించీ రాత్రి పదింటివరకూ కనిపిస్తూనే ఉంది. మధ్యాహ్నం మాత్రం ఓ రెండుగంటలు విశ్రాంతి. అత్తగారూ మరిది ఆడబిడ్డ అందరూ లలితమీద ఆధారపడ్డవాళ్ళే అందరూ ప్రేమగా ఉండడంవల్ల లలిత శ్రమ పడడానికి వెనకాడడం లేదుగాని జీవితం ఇంతే అనుకుంటే మాత్రం చాలా దిగులనిపిస్తోంది.

తను బి.యస్సీ అతను ఎమ్మెస్సీ అతను చదువువల్ల బాధ్యతగల కొడుకుగా, అన్నగా, భర్తగా ధర్మాలు నిర్వర్తిస్తుంటే తన చదువు మాత్రం కేవలం పెళ్ళికి ఓ అర్హత మాత్రమే అయింది.

ఎందుకీ వైరుధ్యం?

తన అభిరుచులూ సమాజంలో స్త్రీ స్థానం పట్ల తనకు తలెత్తుతున్న కొత్త కొత్త సందేహాలూ, జిజ్ఞాసా ఇవన్నీ అవతలకి నెట్టి కేవలం ఓ గౌరవప్రదమైన వంటమనిషిగా, ఇంకొన్ని అదనపు బాధ్యతలతో భార్యగా మాత్రమే జీవించడానికి వీలయింది. అసలు చదువుకున్న స్త్రీలంతా పెళ్ళిళ్ళయి భావదాస్యంవలన ఈ విధంగా కాంప్రమయిజవుతూ బ్రతికేస్తున్నారే గాని ఆర్థిక స్వాతంత్ర్యం వల్ల కొత్తగా వచ్చే పరిణామాలనీ అందుకు సహృదయంగా సంసిద్ధపడి సహకరించవల్సిన పురుషుల బాధ్యతల్ని ఎవరూ గుర్తు చేయడం లేదు. పోరాటం జరపడం లేదు.

జీవితం బాగానే ఉంది. అయినా వెలితిగానే ఉంది.

ఒక రోజు సున్నితంగా, సమగ్రంగా తన ధ్యేయాన్ని కోర్కెలనీ వర్ణించింది.

చంద్రం తేలిగ్గా నవ్వేశాడు. "నీ చదువెప్పుడూ నిరుపయోగం కాదు. రేపోమాపో తల్లివికాబోతున్నావు."

"ఎందుకోనండీ ఉద్యోగం చేయడం కష్టమయినా సరే ఆ కష్టమే నాకు సంతృప్తిగా ఉంటుంది. ఎంత రిస్కు తీసుకోవాల్సి వచ్చినా... అందువల్ల ఎన్ని పోగొట్టు కోవాల్సి వచ్చినా.. నేనూ మనిషిగా, లలితలా బ్రతుకు తున్నాననే ఆత్మవిశ్వాసం కలుగుతుంది" చెప్పాక ఆశగా అతని మొహంలోకి చూసింది.

చంద్రానికి కోపం వచ్చింది. అయిన అతనిలో ఇంకో మనిషి లలితని సానుభూతిగానే అర్థం చేసు కుంటూ ముచ్చట పడుతున్నాడు. అదీ క్షణకాలమే. అంతలోనే సర్దుకుని ప్రశాంతంగా అన్నాడు.

"నువ్వు కోరినవేమీ అసంభవాలు కావు. కాని పెళ్ళి చూపుల్లోనే చెప్పాను. బాధ్యతల బరువులో అలసిపోయిననాకు ఇంట్లో ప్రశాంతమైన వాతావరణం కావాలి. నీమీదెంత ప్రేమ ఉన్నా నీ కోసం ఈ త్యాగం చేయడానికి సిద్ధంగా లేను. అమ్మ హార్ట్ పేషెంట్ ఎవరో ఒకరు దగ్గరుండాలి."

లలిత కింక జీవితంలో ఆ ప్రస్తావన తీసుకు రావాల్సిన సందర్భమే లేకపోయింది. తన మీద అధికారం చెలాయించే వాళ్ళెవరూ లేరు. అయినా బయట కెళ్ళే అవకాశమేలేదు. పిల్లల పుట్టుక వాళ్ళ ఆలనాపాలనా జీవితంలో ఓ పదేళ్ళని సులభంగా నెట్టేలా చేశాయి. అతనికి సమయానికి అన్నీ అందించి సమకూర్చే ఇల్లాలిలా, బిడ్డల తల్లిగా మంచి కోడలిగా ఈ పాత్రలు నిర్వహించడానికి నిర్విరామంగా కృషిచేసింది.

ఆడబిడ్డ పెళ్ళి చేశారు. మరిదికి ఉద్యోగం వచ్చింది. పెళ్ళీ అయింది.

ఇద్దరాడపిల్లలు పుట్టాక సుపుత్రుడుకోసం మూర్ఖంగా ఎదురు చూడకుండా ఆపరేషన్ చేయించేసు కున్నాడు చంద్రం. స్వభావసిద్ధంగా మంచి భావాలే ఉన్న చంద్రం కూతుళ్ళ విషయంలో వినూత్నంగా విజృంభించాడు.

ఎవరడిగినా నాకిద్దరు కూతుళ్ళని సగర్వంగా చెప్పు కునేవారు. భర్తలో ఆపితృ ప్రేమ తాలూకు వైశాల్యానికి లలిత చాలా సంతోషించేది. అసలు అమ్మాయిలిద్దర్నీ ఒద్దికగా ఉండే గృహిణులుగా దంపతులిద్దరూ ఊహించేవారు కాదు. దగ్గరుండి పిల్లలకి సైకిల్, స్కూటర్ నేర్పించాడు. ఆటలు నేర్పించాడు. వాళ్ళకి ఆడపిల్లలమనే ఆత్మన్యూనత లేకుండా చక్కగా స్వేచ్ఛగా పెంచారు. లలిత అతనికన్నా ఓ అడుగుముందే ఉంటుంది కాబట్టి వాళ్ళ పెంపకం సక్రమంగా ఎటువంటి అవరోధాలు లేకుండా సాగిపోతోంది.

మధ్య మధ్య వచ్చే ఆడబిడ్డలు రవ్వంత ఆశ్చర్యాన్ని ప్రకటించే వాళ్ళు. అత్తగార్కి మనమరాళ్ళంటే ఎంతో ముద్దయినా దంపతులిద్దరూ మరీ అవాస్తవంగా పెంచుతున్నారని మొత్తుకునేది.

ఈ మధ్యకాలంలో సాంఘిక జీవితంలో వచ్చిన మార్పులు, వేగం చంద్రం ఆలోచనా ధోరణిని కూడా మార్చాయి.

"పెళ్ళే ముఖ్యంకాదు. ఒక రకంగా మనిషి వ్యక్తి గత వికాసానికి అవరోధం కూడా. ఇప్పుడు చూస్తున్నాం గదా లక్షలిచ్చి గొంతెమ్మ కోర్కెలు కోరే ఏ వెధవలకో అప్పజెప్పి లబోదిబో మనే వ్యవస్థకి నీళ్ళోదిల్తేగానీ పరిష్కారాలు దొరకవు" ఆవేశంగా అనేవాడు చంద్రం.

పెద్దకూతురు నళినికి తండ్రంటే చాలా అభిమానం "అసలు నేను పెళ్ళే చేసుకోను నాన్నా" అనేది తమాషాగా.

"యాక్సిడెంట్స్ అవుతాయని రైళ్ళెక్కడం మానం కదమ్మా. జీవితంలో ఏ పరిస్థితినయినా ఎదుర్కొనే ఆత్మస్థయిర్యం అండదండలు ఆడపిల్లలకుండాలి."

ఒకప్పుడు తన తండ్రి కూడా తన విషయంలో ఎంతో విశాలంగా ఆలోచించే వాడు. ఎప్పుడూ తనని కష్టపెట్టలేదు. లలితకి తన కాలేజీరోజులు గుర్తు కొచ్చేవి అటువంటప్పుడు.

"అసలు ముక్కూ మొహం తెలియని వాడిముందు తలదించుకుని కూచుని ఆ మనిషికి నచ్చితే స్వంత అభిప్రాయం అనేది లేకుండా ఎలా తలూపుతారో పెళ్ళికి ఈ అమ్మాయిలు!" రెండో అమ్మాయి రాగిణి అనేది.

ఆ పరిస్థితిని ఆమోదించడానికి గల సామాజిక నిర్బంధాల వత్తిడుల గురించి లలిత చెబుతుండేది.

"ఏది ఏమైనా నా పిల్లల గురించి వాళ్ళు రిక్వెస్ట్ చేయాల్సిందే తప్ప కేవలం పెళ్ళి అవడం కోసం నా పిల్లల తరుపున ఎవర్నీ దేబిరించను" చంద్రం అనేవాడు.

నళిని బి.టెక్ అయింది, రాగిణి బి.యస్సీ ఫైనలియర్‌కి వచ్చింది.

"నళిని పెళ్ళిచేద్దాం" లలిత గుర్తు చేసింది.

"నళిని ఇష్టం" అయిష్టంగా అన్నారు.

"ఇప్పుడేం పెళ్లి? నేను ఎమ్.టెక్ చేయాలి జాబ్ సంపాదించుకోవాలి" నళిని ఆ ప్రతిపాదన కొట్టిపారేసింది. అమ్మయ్య అనుకున్నాడు చంద్రం. బంతిలా ఎగురుతూ, ఆడుతూ పెరుగుతున్న కూతుర్ని ఓ ఇల్లాలిగా, ఓ మగవాడి అడుగులకి మడుగులొత్తే స్త్రీ మూర్తిగా అస్సలు ఊహించుకో బుద్ధికావడం లేదు.

యమ్.టెక్ అయింది. ఉద్యోగం వచ్చింది. చూస్తుండగానే పాతికేళ్ళు వచ్చేశాయి. చదువుకి కెరీర్ కీ ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల నళిని ప్రేమ వ్యవహారాల్లో పడలేదు. అదీ గాక ఆమెకి స్పందన కలిగించే పురుషుడు బయట ప్రపంచంలో తారసిల్ల లేదు.

సినిమాల్లో ప్రేమని తెగ చూపిస్తారు. కులానికీ, డబ్బుకీ తర్వాత అందానికీ విలువిచ్చే సమాజంనించి తయారవుతున్న ఏ యువకుడూ పెళ్ళి విషయంలో స్వతంత్రంగా వ్యవహరించ డు. అందుకే నచ్చిన వ్యక్తి దొరకడం అనేది ఒక్కోసారి దుర్లభం అవుతుంది. అసలటువంటి ప్రతిపాదనలు తెచ్చే మొగవాళ్ళూ, ఆ అవకాశాలూ తగలాలిగదా? ఎటూ నిర్ణయించుకోలేక నళిని నిట్టూరుస్తూ ఓ రెండేళ్ళు గడిపేసింది.

"వయస్సు మీరాక పెళ్ళికి ఆ ఒక్కటే సమస్యవు తుంది" ఆందోళనగా అంది లలిత.

"నేనేం చేయను. నేనందరిలా పెంచలేదు వీళ్ళని. అందుకే అందరి తండ్రుల్లా వ్యవహారించలేను, మాటాడలేను."

"కావచ్చు. నా పెళ్ళి చేయండి నాన్నా అని ఏ కూతురూ నోటితో చెప్పలేదు".

"అసలు నన్నగడం ఎందుకు తనే చేసుకోవచ్చు!"

"మనుష్యులు దొరకాలిగా! లలిత మృదువుగా అంది. మనం ఒక రకంగా స్వేచ్ఛ నిస్తూనే మానసికంగా వాళ్ళని డిసిప్లిన్‌లో పెట్టాం. చదువయి ఆర్థికంగా కాళ్ళ మీద నిలబడేవరకూ వీళ్లీ ప్రేమ గొడవలు తగిలించుకోకూడదని పదేపదే చెప్పాం. పాపం మన మాట విన్నారు. జీవిత భాగస్వామిని ఎలా వెతుక్కోవాలో మనం నేర్పలేదు."

"నళిని మరీ చిన్న పిల్లకాదు" చంద్రం అసహనంగా అన్నాడు. పెళ్ళనేది ఇంత సమస్యాని అతనికి చిరాకు కలుగుతోంది.

"నిజమే చిన్న పిల్లకాదు అమెకి ఇరవయ్యారునిండాయి. అందుకే నాకు ఖంగారు. ఒక ఖచ్చితమైన సమయానికి స్వతంత్రంగా నిర్ణయించుకునే శక్తి ఉన్న అనువైన పార్టనర్ దొరక్కపోవచ్చు. మనరోజుల్లోనే నయం. మీరు కట్నం తీసుకోకూడదనే నియమంతో పెళ్ళి చూపుల కొచ్చారు. నాకు సంపాదనా శక్తి లేకపోయినా నావైపు నుంచి ఏనాడూ ఎదీ ఆశించలేదు మీరు. మీకు కొన్ని నిర్దిష్టమైన విలువలున్నాయి. కాని చదువుల్లో ఇంత అభివృద్ధి చూపిస్తున్న ఈనాడు కుర్రాళ్ళకి ఆదర్శాలంటే ఎగతాళి. పెళ్ళివలన వచ్చిపడే కొత్త స్టేటస్, ధనమూ వాళ్ళకి కావాలి. కులాల పక్ష మతాల పట్ల వాళ్ళ విశ్వాసాల్లో ఏ కొత్త మార్పులూ రాలేదు. కుర్రాళ్ళ మనస్తత్వాన్ని అసలు గమనించడం లేదు మీరు. ఈ పరిస్థితుల్లో నళినిని దాని మానాన దాన్ని వదిలిపెట్టడం న్యాయమా? మనం చొరవచేసుకుని తగిన వ్యక్తిని చూసి పెళ్ళి చేయవద్దా?

భార్య హితబోధతో అంతవరకూ అతను గుడ్డిగా నమ్ముతున్న కొన్ని సిద్ధాంతాల మత్తునుంచి బయట కొచ్చాడు చంద్రం. రాగిణికి కూడా ఇరవయి నాలు గేళ్లొచ్చాయి.

"అసలే కులమయినా ఫర్వాలేదని మేట్రి

మోనియల్‌లో ఇస్తాను" చంద్రం గబాల్న లేచి నిలబడ్డాడు.

"మీ ఆయనకి మతిపోయింది" అక్కడే ఉన్న లలిత తల్లి లబలబలాడింది.

"అన్నయ్య చాలా మారాడు." ఏభావమూ ధ్వనించని కంఠంలో ఏదో పనిమీద ఆ ఊరొచ్చిన మరిది అన్నాడు.

లలిత చంద్రాన్ని ఆపి ముందుగా కులంలోనే వరాన్వేషణ చేసి, ఆ తర్వాత కులాంతరానికి కూడా సిద్ధం అన్నట్టుగా వివరాలిద్దాం' అని సలహా చెప్పింది.

ఒక్క నెలలోనే మంచి రెస్పాన్స్ వచ్చింది. స్వంత కులాల్లో వచ్చిన వరుళ్ళు కట్నం గురించి కాకపోయినా ఆస్తిపాస్తుల గురించి అడిగారు. చంద్రానికి ఒంటికి కారం రాచుకున్నట్టయింది. మంచి ఉద్యోగం చక్కని తెలివితేటలూ ఉన్న కూతుళ్ళకి ఇటువంటి భర్తలని ఊహించడం అతనికి సాధ్యం కావడం లేదు. లలితకి కూడ ఆ మగవాళ్ళ ధోరణీ, ఆ ప్రశ్నలూ ఆ ఆశలూ చిరాకనిపించాయి. సాంప్రదాయక భీరుత్వం తప్ప ధీమంతుల్లా ఎవరూ కనబడ్డంలేదు.

మళ్ళీ ఇంకోసారి ప్రకటన ఇచ్చాడు ఈసారి ఇంట్లో చెప్పలేదు. ఈసారి కులాంతరమైనా ఫర్వాలేదన్నట్టుగా ఇచ్చాడు. ఆ ప్రకటన ప్రకారం ఓ ఇంజనీర్ ఫోన్‌లో చంద్రాన్ని కాంటాక్ట్ చేసి ఏ ఆర్భాటాలూ లేకుండా "స్నేహ పూర్వకమైన రాక" అనిపించేలా ఒక ఆదివారం సాయంత్రం వచ్చేశాడు. అతన్ని రిసీవ్ చేసుకోగానే లలిత మనస్సులో మెచ్చుకుంది. అతను ఫారిన్‌లో ఉంటున్నాడు. కేవలం పెళ్ళి గురించి ఇండియా వచ్చాడు. ఇంకో రెండేళ్ళలో ఈ దేశానికి పూర్తిగా వచ్చే ఉద్దేశం ఉంది. హుందాతనం తప్ప భేషజం అసల్లేదు.

చంద్రం చాదస్తంతో ఎక్కడా సంబంధాన్ని ఎగరగొడతాడేనని ఊళ్ళో ఉన్న తల్లిదండ్రులకీ అన్నకీ కబురుపెట్టి అప్పటికప్పుడు పిలిపించింది లలిత గతించిన అత్తగార్ని గుర్తుచేసుకుని కళ్ళు తుడుచుకుంది.

అతనికి, నళిని నచ్చింది. కారులో ఆమెను తీసుకుని కాస్సేపు బయటకెడతానని వినయంగా అడిగాడు. ఎవ్వరూ అభ్యంతరం చెప్పలేదు. పరిస్థితుల వల్ల వెనకటితరం వాళ్ళు కూడా ఆలోచనల్లో ముందుకొచ్చారు. కులమేమిటీ? అనే ప్రశ్న గూడా ఇప్పుడు చచ్చు ప్రశ్నలా అనిపించిందరికీ. అందుకే అసలా ప్రశ్న తమలో తాము వేసుకోకుండా జాగ్రత్త పడ్డారు.

నళినీ ఆ యువకుడూ బయటకెళ్ళి పోయాక అందరూ ఉత్సాహంగా వర్ణించడం మొదలెట్టారు.

'ఈ మాచ్ సెటిలయితే చాలు' జీవితంలో మొట్ట మొదటిసారిగా కేవలం తండ్రిలా, కూతురు సుఖపడుతుందని ఆరాటపడే తండ్రిలా ఆలోచించాడు చంద్రం.

ఇంతలో అర్జంట్‌గా తిరిగొచ్చారు. అతను అందరికీ బై చెబుతూ అన్నీ వివరంగా నళినితో మాట్లాడాననీ ఆలోచించి నిర్ణయించుకున్నాక ఎల్లుండి ఫోన్ చెయ్యమనీ, వీలయితే పదిరోజుల్లో రిజిష్టర్ మ్యారేజి గాని ఇంకో రకమయిన పెళ్ళిగాని చేసుకోవడానికి సిద్ధమేనని చెప్పి కారు స్టార్ట్ చేశాడు. అందరికీ ఇదంతా కలలా ఉంది. నళినిని చుట్టు ముట్టారు ఉత్సాహంగా.

"తల్లీ నీ కిష్టమే కదరా?" చంద్రం వాత్సల్యంగా కూతురి తలనిమురుతూ అడిగాడు.

"ఇష్టమే నాన్నా...కానీ" అదోరకంగా నవ్వింది.

"ఏంటమ్మా చెప్పు?"

"అతను నన్నుద్యోగం మానేయమంటున్నారు" తల దించుకుంటూ అంది.

"లాంగ్ లీవ్ పెట్టడం కుదరదేమోకదూ! అయినా రెండేళ్ళలో తిరిగొచ్చే ఉద్దేశం ఉందన్నాడు."

"నిజమే. పోనీ అక్కడయినా చేస్తానూ అంటే ఆదేశంలో మరీ మెకానికల్‌గా బ్రతకాలి ఇప్పుడేమీ వద్దులే అంటున్నారు."

"అదేమిటీ ఇంత చదువుకునీ, నువ్వు పి.హెచ్‌డీ కూడా చెయ్యాలనుకుంటున్నావు గదా? అన్నీ వదిలేసి వంటచేసుకుంటూ గోళ్ళు గిల్లుకుంటూ కూచోవాలా?" చంద్రానికి చాలా కోపమొచ్చింది.

"మీరూరుకోండి పెళ్ళయాక ఆ గొడవేదో వాళ్ళిద్దరూ చూసుకుంటారు. కన్విన్స్ చేస్తే అతను వింటాడు" లలితకి సంబంధం చేజారనీయడం అస్సలిష్టంలేదు.

"అవునవును ఈ లోపల వంటావార్పూ పిల్లలూ మొగుడిసేవ.. తనో ఇంజనీర్ననే విషయం గుర్తు చేసుకోవడానికి టైమ్ ఉండదు" వ్యంగ్యంగా, బాధగా అన్నాడు.

"చంద్రం నీకసలు మతిపోయింది" లలిత తండ్రికి విసుగొచ్చి అనేశాడు. "అసలు నీ చుట్టూ ప్రపంచాన్ని గమనిస్తున్నావా?"

"అసలితనికెంత ధైర్యం? బి.హెచ్.ఇ.యల్‌లో చక్కని ఉద్యోగాన్ని పెళ్ళిగురించి వదులుకోమంటాడా?. ముక్కు మొహం ఎరగని ఈ వ్యక్తికోసం కెరియర్ నాశనం చేసుకుని... అక్కర్లేదు నా కూతురు దర్జాగా బ్రతుకుతుంది. పెళ్ళిగాక పోతే మరేం కాదు" పట్టుదల ధ్వనించింది చంద్రం మాటల్లో.

లలిత సహనాన్ని కూడ దీసుకుంది. "అసలు మనిద్దరం వాదించుకోవడం కాదు. నళిని అభిప్రాయం అడుగుదాం."

"నళిని సరెండర్‌కాదు" చంద్రం ఎంతో నమ్మకంగా అన్నాడు.

"ఏదమ్మా నళినిని పిలు. మనం పది రకాలుగా మాటాడుకోవడం అనవసరం" క్రిష్ణారావ్ అన్నాడు. నళిని వచ్చింది. అందరూ ఉత్కంఠగా చెవులు రిక్కించారు. రాగిణికి అక్క ఏం చెబుతుందాని ఎక్సయిటింగ్‌గా ఉంది. లలిత తల్లి ప్రాణం రెపరెపలాడుతోంది. ఏదో అనబోతున్న చంద్రాన్ని ఉరిమిచూస్తు నళినిని చెప్పనీయండన్నట్టు సైగచేసింది.

పరిసరాలన్నీ నిశ్శబ్దంగా మారిపోయాయి. నళిని వెంటనే మాటాడ లేక పోయింది. పరిస్థితి చాలా ఇరకాటంగా ఉందనిపించింది. కళ్ళ మూసుకుని దగ్గింది. "అతను చాలా ఫ్రాంక్‌గానే మాటాడుతున్నారు నాన్నా. ఫారిన్‌లో ఆ స్పీడ్ లైఫ్ గురించి చెబుతూ ఆవేగం వల్ల ఎన్నో పోగొట్టుకోవాల్సి వస్తుందనీ అందుకే వుడ్‌బీ అక్కడ ఉద్యోగం చేయకుండా ఉండడమే మంచిదనీ నొక్కి చెబుతున్నారు. నాకు క్వాలిఫికేషనుంది పరిస్థితులు తిరగబడితే మళ్ళీ నిలదొక్కుకుని బ్రతికే ఆత్మ స్థయిర్యముంది."

"నళినీ నువ్వుకూడా..."

"సారీ నాన్నా నాకూ మనసొప్పడంలేదు. నువ్వు భయపడుతున్నట్టు వంటింటి కుందేలుని కాను కాని అప్పటివరకూ".

కన్నీళ్ళు దాచుకుంటున్న కూతుర్ని ఆదరంగా దగ్గరకు తీసుకున్నాడు. "పిచ్చి పిల్లా నాన్నేమనుకుంటాడో అని ఫీలవుతున్నావా మరీ ఆదర్శాలని రంగరించి పోసి కొన్ని అవసరాలనూ, జీవితానందాలనూ దూరం చేసే మూర్ఖుణ్ని కాను. రేపే అతని గురించి ఎంక్వయిరీ చేస్తాను. ఇది ఓటమికాదు. అసలు పెళ్ళనేది ఇప్పుడు చాలెంజ్!" చంద్రం మాటలకి అందరూ మనసారా నవ్వారు.

### బడుగు వర్గాల వనితల ఆర్థిక ప్రగతి కోసం

## "స్వావలంబన పథకం"

**జాతీయ స్థాయిలో** బడుగు వర్గాల వనితల ఆర్థిక ప్రగతి కోసం జిల్లా యంత్రాంగం "స్వావలంబన పథకాన్ని" విశాఖ జిల్లా పరవాడ మండలం, కన్నూరు గ్రామంలో ప్రారంభించింది.

బంగ్లాదేశ్ గ్రామీణ బ్యాంకింగ్ వ్యవస్థలో అమలులో వున్న ఈ "మైక్రో క్రెడిట్ లెండింగ్ ప్రోగ్రామ్"ని, "స్వావలంబన పథకం" పేరుతో మన దేశంలో, మొట్టమొదటి సారిగా విశాఖ జిల్లాలో ప్రవేశ పెట్టారు.

ఈ పథక రచయిత, మూలసూత్రధారి, జిల్లా కలెక్టర్ శ్రీ పి. దయాచారి, కన్నూరు గ్రామంలో మహిళలనుద్దేశించి, ప్రారంభోత్సవ సభలో "స్వావలంబన' పథకం విశిష్ట లక్ష్యాలను వివరించారు.

ఐదువేల మంది మహిళలకు విశాఖ జిల్లాలో, ఈ వినూత్న పథకం క్రింద, రు ణాలు లభిస్తాయి.

మహిళా సంఘాలు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, పది మంది కొక జట్టు చొప్పున ఏర్పాటు చేస్తారు. ఈ పది మందికి ఒక నాయకురాలు వుంటుంది. ఈ పథకం బడుగు వర్గాలకు చెందిన 18 సంవత్సరాలు పైబడి 50 సం॥లులో వయస్సు కల స్త్రీలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ పది మందిలో మొదటి విడతగా ముగ్గురికి రుణాలను స్థానిక జాతీయ బ్యాంకుల ద్వారా అందచేస్తారు. మూడు నెలల పదిరోజులు (100 రోజులు) కాలం తర్వాత మరో ముగ్గురికి ఋణాన్ని చెల్లిస్తారు. మొదటి విడతలో ఋణాన్ని తీసుకున్న ముగ్గురు స్త్రీలు, వారు తీసుకున్న ప్రతీ వందరూపాయల చొప్పున బ్యాంకుకు జమ చేస్తారు. అంటే రోజు, ఒక రూపాయి, ఋణగ్రహీత పొదుపు చేసుకుంటున్నది. అప్పు తీర్చుకుంటూ, ఏకకాలంలో తీసుకున్న అప్పుకు సమంగా డబ్బు పొదుపు చేసుకోవటం, ఈ "స్వావలంబన పథకం"లోని విశిష్ట లక్ష్యం. ఈ విధంగా సక్రమంగా ఋణాలను పదిమందిలో మూడు గ్రూపులు (తొమ్మిది మంది) చెల్లించిన తర్వాత, గ్రూపు నాయకురాలికి, అప్పు దొరుకుతుంది. బ్యాంకు అధికారులకు, నాయకురాలి భరోసావల్ల, అప్పు ఎగవేతకు అవకాశం లేదు.

పాలు, కాయగూరలు, బుట్టలు, చీపుర్లు, చాపలు, మొదలైన వ్యాపారాలు చేసుకుని ఇల్లు గడుపుకునే బడుగు వర్గాల స్త్రీల ఆర్థిక ప్రగతి కోసం ఈ స్వావలంబన పథకం కొండంత అండగా నిలిచింది.

ఈ చిన్న తరహా వ్యాపారాలు చేసుకునే గ్రామీణ స్త్రీలు, రోజుకు వంద రూపాయలను అప్పుగా తీసుకుని, దానికి అధిక మొత్తంలో వడ్డీ చెల్లిస్తున్నట్లు దాఖలాలు వున్నాయి. వడ్డీ వ్యాపారులు రోజుకు 90 రూపాయలు అప్పుగా యిచ్చి ఆరోజు సాయంత్రం 100 రూ॥లు తీసుకోవటం, మనకు తెలిసిందే!

విశాఖ జిల్లా మహిళా మండలుల సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి పి. శోభన చొరవతో, ఈ స్వావలంబన పథకం జిల్లాలోని మహిళా మండలులకు విస్తరింపచేశారు.

**ఎమ్. సత్తిరెడ్డి**